సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

ఆదివారం । 29 । జూన్ । 2025



బీసీలపై చిన్నచూపు

బీసీలపై అన్ని రాజకీయ పార్టీలు చిన్నచూపు చూస్తున్నాయని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. - 8లో▸



వ్యాధులు నియంత్రించాలి..

సమన్వయంతో సీజనల్ వ్యాధులను నియంత్రించాలని రాష్ట్ర కుటుంబ శాఖ కమిషనర్ సంగీత సత్యనారాయణ అధికారులకు సూచించారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$33^0/25^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ముగిసిన స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్స్



వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో మూడు రోజుల పాటు నిర్వహించిన క్రీడా పాఠశాలల్లో ఎంపిక ప్రక్రియ శనివారంతో ముగిసింది. హైదరాబాద్‌లోని హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లో ఉన్న స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల ఎంపికలను నిర్వహించినట్లు డీవైఎస్‌ఓ గుగులోతు అశోక్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి 21 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆయన తెలిపారు. ఇందులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఎంపిక చేసి హకీంపేటలో జరిగే రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ స్కూల్స్ ఎంపికలకు పంపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌ఏ కోచ్‌లు, పీడీలు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనం నడిపిన 19 మందికి జైలు

వరంగల్ క్రైం: గత వారం రోజుల్లో మద్యం సేవించి వాహనం నడిపిన 19 మంది వాహనదారులు జైలుశిక్ష అనుభవించారని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. ట్రైసిటీ ట్రాఫిక్ పోలీసులు ముమ్మరంగా జరిపిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మొత్తం 368 కేసులు నమోదు కాగా, ఇందులో 19 మంది వాహనదారులకు జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చిందని, రూ.5.82 లక్షల జరిమానా చెల్లించినట్లు వివరించారు. వరంగల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 168 కేసులు నమోదు కాగా, ఆరుగురికి జైలుశిక్ష, రూ.2.22 లక్షలు జరిమానా చెల్లించారని పేర్కొన్నారు. హనుమకొండ పరిధిలో 104 కేసులో 8మందికి జైలు, రూ.1.09 లక్షల జరిమానా చెల్లించగా, కాజీపేట పరిధిలో 95 కేసులు, ఐదుగురికి జైలుశిక్ష పడగా, రూ.2.50 లక్షలు జరిమానా చెల్లించినట్లు వివరించారు.

సాహస అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ స్పోర్ట్స్: యువతనుంచి టెన్సింగ్ నార్గే జాతీయ సాహస అవార్డులు–2024 కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హనుమకొండ జిల్లా యువజన క్రీడల అధికారి గుగులోతు అశోక్‌కుమార్ శనివారం తెలిపారు. సాహస రంగాల్లో వ్యక్తుల విజయాలను గుర్తించేందుకు యువజన వ్యవహారాల, క్రీడల మంత్రిత్వ శాఖ ఈ అవార్డులను అందించనున్నట్లు తెలిపారు. గడిచిన మూడేళ్లలో చేసిన సాహస కృత్యాల గురించి వివరిస్తూ మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు జతచేసి ఈ నెల 30వ తేదీలోపు https://awards.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పాఠ్యపుస్తకాల గోదాం పరిశీలన



విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లా కేంద్రంలోని పాఠ్యపుస్తకాలకు సంబంధించిన గోదామును హైదరాబాద్‌లోని రాష్ట్ర ప్రభుత్వ పాఠ్యపుస్తకాల ముద్రణ డైరెక్టర్ సీహెచ్.రమణకుమార్ శనివారం సందర్శించారు. జిల్లాకు పాఠ్యపుస్తకాలు ఎన్ని వచ్చాయి? ఎన్ని పంపిణీ చేశారనేది పరిశీలించారు. జిల్లాకు వచ్చిన పాఠ్యపుస్తకాలను సకాలంలో డీఈఓ ఇచ్చిన ఇండెంట్ ప్రకారం గోదాం నుంచి మండలాలకు పంపిణీ చేసినట్లు పాఠ్యపుస్తకాల గోదాం మేనేజర్ వి.పద్మావతి డైరెక్టర్ రమణకుమార్‌కు తెలిపారు. గోదాంకు వచ్చిన పాఠ్యపుస్తకాల పంపిణీ వివరాలకు సంబంధించి జాబితా పరిశీలించి గోదాం తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్య పెరిగిన స్కూళ్లకు పాఠ్యపుస్తకాల కోసం డీఈఓ ద్వారా ప్రతిపాదనలు తమకు పంపాల్సి ఉంటుందని రమణ కుమార్ పేర్కొన్నట్లు సమాచారం. పాఠ్యపుస్తకాల గోదాం సీనియర్ అసిస్టెంట్ ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

నేటినుంచి యథావిధిగా రైళ్ల రాకపోకలు

కాజీపేట రూరల్: కాజీపేట సబ్ డివిజన్ పరిధిలో పెద్దపల్లి రైల్వే బ్రిడ్జి ఘటన, ఇతర రైల్వే ఆపరేషనల్ కారణాలతో శుక్ర, శనివారాలు రద్దు అయిన పలు రైళ్లు ఆదివారం నుంచి యథావిధిగా నడుస్తాయని రైల్వే అధికారులు తెలిపారు. కాజీపేట–విజయవాడ –బల్లార్షా–సికింద్రాబాద్ సెక్షన్‌లో రద్దు, దూరం తగ్గింపు, రీషెడ్యూల్ అయిన పలు ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు యథాతథంగా నడవనున్నట్లు పేర్కొన్నారు.

పెళ్లిలో విగ్రహం ఓ ఎమోషన్



వడిచర్ల శ్రీనివాస్ ఫైబర్ విగ్రహంతో ఆయన కుటుంబ సభ్యులు (ఫైల్)

ఐనవోలు: మండల కేంద్రానికి చెందిన వడిచర్ల శ్రీనివాస్–అనురాధ దంపతుల కుమారుడు కమల్‌హాసన్, కూతురు శివాని. శ్రీనివాస్ టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. సమాజ సేవంటే ఇష్టపడే శ్రీనివాస్ ఎంపీటీసీగా పని చేశారు. గతేడాది జనవరి 22న అనారోగ్య కారణాలతో ఆయన మృతి చెందాడు. కమల్ హాసన్ నాన్న నిర్ణయం మేరకు డిగ్రీ తర్వాత లండన్‌కు వెళ్లారు. తండ్రి చనిపోయిన తర్వాత ఆయన కోరిక మేరకు చెల్లి పెళ్లి జరిపించాడు. ఆపెళ్లిలో అతడి తండ్రి ఫైబర్ విగ్రహాన్ని తయారు చేయించి నాన్నతో తనకున్న ఎమోషన్‌ను అందరికి చూపించాడు. ఈసారి లండన్ నుంచి ఇండియాకు వచ్చినపుడు ఆ ఫైబర్ విగ్రహాన్ని మండల కేంద్రంలో ఏర్పాటు చేయించనున్నట్లు కమలహాసన్ తెలిపారు.

ఇంటి దేవతకు గుడి



తల్లి సుజాత విగ్రహం వద్ద కుమారుడి కుటుంబం

ఖానాపురం: బుధరావుపేట గ్రామానికి చెందిన ఏనుగుతల వెంకటనారాయణ–సుజాత దంపతులది మధ్య తరగతి కుటుంబం. వీరికి ఒక కుమారుడు శ్రావణ్‌కుమార్. సుజాత 2023 జూన్ 6న గుండెపోటుతో మృతి చెందింది. దీంతో ఆమెకు గుర్తుగా గ్రామ శివారులోని పంటపొలం వద్ద కుమారుడు, భర్త కలిసి విగ్రహం ఏర్పాటు చేశారు. ఆమెకు గుడి కట్టించారు. ఇంటి దేవతను మరిచిపోకుండా ఉండేందుకు 2024 జూలైలో విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు ఆమె కుటుంబీకులు చెబుతున్నారు.



నాన్న ప్రతిరూపానికి కోవెల

చిట్యాల: మండల కేంద్రానికి చెందిన ఓర్సు శ్రీకాంత్‌కు అతడి నాన్న రవి అంటే ప్రాణం. కుటుంబ బాధ్యతలు మోసే క్రమంలో రవి అప్పుల బాధతో గతేడాది ఏప్రిల్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ బాధను దిగమింగుకుని ఆయన ప్రతిరూపాన్ని రోజూ చూడాలని శ్రీకాంత్ తన వ్యవసాయ భూమిలో రూ. 3.50 లక్షలు వెచ్చించి గుడి నిర్మించాడు. భవిష్యత్ తరాలకు తండ్రి గొప్పదనాన్ని చాటిచెప్పేందుకు.. నాన్న ప్రతి రూపాన్ని గుండెల్లో దాచుకునేందుకు గుడిని కట్టినట్లు శ్రీకాంత్ చెబుతున్నాడు.

అనుబంధాల.. ప్రతిరూపం

గతించినా.. ఎప్పుడూ గుర్తుండేలా.. ఉమ్మడి జిల్లాలో ఆలయాలు నిర్మించి విగ్రహాల ప్రతిష్ఠాపన

- శుభకార్యాల్లో మనిషిని పోలిన ఫైబర్ బొమ్మలు
- జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటున్న ఆత్మీయులు

గతించిన కాలాన్ని తీసుకురాలేం. వెళ్లిపోయిన మనుషులనూ పట్టుకురాలేం. వివిధ రూపాల్లో వారితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకోవడమొక్కటే మార్గం. కుటుంబానికి దూరమైన వారిని చిరకాలం గుర్తు పెట్టుకునేలా కొందరు అచ్చుగుద్దినట్లు విగ్రహాలు తయారు చేయిస్తున్నారు. కొన్నిచోట్ల ఆ విగ్రహాలకు ఆలయాలు నిర్మించి పూజలు చేస్తున్నారు. శుభకార్యాలైతే ఫైబర్ బొమ్మలు పెట్టుకుని మరీ ఫ్యామిలీ ఫొటోలు తీసుకుంటున్నారు. అనుబంధాల్ని పెనవేసుకుంటున్న ఆ విగ్రహాల కథే ఈ వారం 'సాక్షి' సండే స్పెషల్.

సండే స్పెషల్

కుమారులు దూరమై.. విగ్రహాల్లో కొలువై



మేటి శ్రవణ్, శివ విగ్రహాలు

కొడకండ్ల: అల్లారుముద్దుగా పెంచుకున్న ఇద్దరు కుమారులు రోడ్డు ప్రమాదంలో దూరమయ్యారు. పుట్టెడు దుఃఖాన్ని దిగమింగుకుని వారి జ్ఞాపకాల్ని నెమరు వేసుకుంటూ ఆ తల్లిదండ్రులు కాలం వెళ్లదీస్తున్నారు. ప్రాణం పోయిన వారి కుమారులకు విగ్రహాల రూపంలో ప్రాణం పోసి కళ్లారా చూస్తున్నారు. కొడకండ్ల మండలం రామవరం గ్రామానికి చెందిన మేటి రాములు–రాజేశ్వరి దంపతులకు ముగ్గురు కుమారులు. వ్యవసాయమే జీవనాధారమైన వారు కుమారులను చిన్నప్పటి నుంచి ప్రైవేట్ పాఠశాలల్లోనే చదివించారు. తల్లిదండ్రుల శ్రమను గుర్తించిన వారు ప్రయోజకులయ్యారు. పెద్దకుమారుడు అరవింద్, రెండో కుమారుడు శ్రవణ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా హైదరాబాద్‌లో మూడో కుమారుడు శ్రవణ్ వరంగల్ ఎంజీఎంలో హౌస్ సర్జన్‌గా పనిచేసేవారు. గత సంవత్సరం మే 19న శివ హైదరాబాద్‌లోని అన్న శ్రవణ్ వద్దకు వెళ్లాడు. భోజనం తెచ్చుకునేందుకు బయటికి వెళ్లిన ఇద్దరు సోదరులను స్కార్పియో కారు ఢీకొట్టడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. కుమారులను గుర్తు చేసుకుంటూ తమ వ్యవసాయ భూమిలో గదిని నిర్మించి శ్రవణ్, శివ విగ్రహాలను ఏర్పాటు చేయించారు. మే 19న ప్రథమ వర్ధంతి సందర్భంగా తల్లిదండ్రులు ఆవిష్కరించుకున్నారు.

ఎల్లప్పుడూ కళ్ల ముందే ఉండాలని..



దుబ్బతండాలో ఏర్పాటు చేసిన బాల్యా, సాయికుమార్ విగ్రహాలు

డోర్నకల్: కంటికి రెప్పలా చూసుకునే భర్త, అమ్మా అమ్మా అంటూ రోజుకు వెయ్యిసార్లు పలకరించే కుమారుడు అకస్మాత్తుగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో దిక్కుతోచని స్థితికి చేరుకున్న ఓ మహిళ తన భర్త, కుమారుడిని విగ్రహాల రూపంలో చూసుకుంటూ వారి జ్ఞాపకాలను నెమరువేసుకుంటుంది. డోర్నకల్ మండలం దుబ్బతండాకు చెందిన అజ్మీర బాల్యా, భారతి దంపతులకు సాయికుమార్ ఏకైక కుమారుడు. భారతి దుబ్బతండా సర్పంచ్‌గా పని చేసి భర్త బాల్యా సహకారంతో గ్రామాభివృద్ధిలో తమ వంతు పాత్రను సమర్థవంతంగా నిర్వహించింది. బాల్యా, భారతి వ్యవసాయం చేస్తుండగా కుమారుడు ఖమ్మంలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. ఈనెల 5న కుమారుడు సాయికుమార్‌ను కళాశాలకు పంపేందుకు బాల్యా ఖమ్మం బయల్దేరగా ఖమ్మంలో ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొని బాల్యా, సాయికుమార్ మృతి చెందారు. వారిని మర్చిపోలేని భారతి.. బాల్యా, సాయికుమార్ విగ్రహాలను గ్రామ ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసింది. జూన్ 15న వారి సంతాప సభలోబాల్యా సాయికుమార్ విగ్రహాలను ఆవిష్కరించారు.

కల్యాణి కట్టించిన గుడి



భర్త జ్ఞాపకాలతో..




హరిబాబు విగ్రహం వద్ద కల్యాణి

మహబూబాబాద్ రూరల్: కట్టుకున్న భర్తను ప్రాణంగా భావించి ఆయన మృతి అనంతరం పాలరాతితో విగ్రహం చేయించి ఓ భార్య ఆయనకు గుడి కట్టించింది. మహబూబాబాద్ మండలం సోమ్లా తండా గ్రామానికి చెందిన బానోత్ కల్యాణి ఎంపీటీసీగా పనిచేసింది. హరిబాబుతో ఆమెకు 1996లో వివాహం కాగా.. 2021లో హరిబాబు అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయనతోపాటే తాను చనిపోదామని కల్యాణి ప్రయత్నించినా బంధువులు ధైర్యం చెప్పడంతో హరిబాబు జ్ఞాపకాలతో జీవిస్తోంది. ఈక్రమంలో రూ.5.30 లక్షలతో పండుగ వాతావరణంలో గతేడాది ఏప్రిల్ 23న గుడి ప్రారంభించింది. ప్రతీ శనివారం ఆయనకు పూజలు చేస్తోంది.

'క్రమశిక్షణ' కోర్టులో కాంగ్రెస్ పంచాయితీ!

ఇటీవల వివాదాస్పదమైన కొండా దంపతుల కామెంట్స్

- టీపీసీసీ, ఏఐసీసీ నేతలకు ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యేలు
- మల్లు రవిని కలిసేందుకు గాంధీభవన్‌కు కొండా మురళి
- తనపై ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యేలపై ఆరోపణల లేఖ?
- కొత్త వివాదానికి తెరతీసిన లేఖాంశాలు



సాక్షిప్రతినిధి, వరంగల్:


ఓరుగల్లు కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల పంచాయితీ క్రమశిక్షణ సంఘం ముందుకు చేరింది. కొద్ది నెలలుగా చాపకిందనీరులా ఉన్న అంతర్గత కుమ్ములాటలు పది రోజుల క్రితం వీధికెక్కాయి. ఇటీవల రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా కొండా మురళి సొంత పార్టీ ఎమ్మెల్యేలపై విమర్శలు చేయగా.. ఆ మరుసటి రోజే మంత్రి కొండా సురేఖ సైతం ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో హనుమకొండలో సమావేశమైన ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తదితరులు మీడియాతో మాట్లాడుతూ.. కొండా దంపతుల వ్యాఖ్యలను ఖండించారు. ఆ తర్వాత కూడా ఇరువర్గాల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు పెరిగి.. టీపీసీసీ, ఏఐసీసీలకు ఫిర్యాదు చేసే వరకు వెళ్లాయి. ప్రతిపక్షాలు సైతం వాడని పదజాలంతో ఒకే పార్టీలోని ప్రజాప్రతినిధులు దూషించుకోవడం రాజకీయవర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీయగా.. ఆ వివాదంపై చర్యలకు సిద్ధమైన క్రమశిక్షణ సంఘం అందరినీ ఆరా తీస్తుండడం పార్టీ కేడర్‌లో ఇప్పుడు హాట్‌టాపిక్ అయ్యింది. ఇదే సమయంలో శనివారం తన అనుచరులతో హైదరాబాద్ గాంధీ భవన్‌కు వెళ్లిన మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి.. కాంగ్రెస్ క్రమశిక్షణ సంఘం చైర్మన్ మల్లు రవిని కలిసి వివరణ లేఖలో కీలక అంశాలను ప్రస్తావించడం కొత్త చర్చకు దారి తీసింది.

మరో వివాదానికి తెరలేపిన 'లేఖ'..

ఈనెల 22న హైదరాబాద్‌లో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌ను కలిసిన నాయిని రాజేందర్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, కడియం శ్రీహరి తదితరుల బృందం.. 'మేం కావాలో.. కొండా దంపతులు కావాలో తేల్చండి' అన్న ధోరణిలో ఫిర్యాదు చేసింది. ఈమేరకు క్రమశిక్షణ సంఘం రంగంలోకి దిగగా.. శనివారం కొండా మురళీధర్ గాంధీభవన్‌కు వెళ్లి మల్లు రవిని కలిసి మాట్లాడారు. ఆ తర్వాత మీడియాతో కూడా కొండా మురళి మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన క్రమశిక్షణ సంఘానికి ఇచ్చినట్లుగా ఆరు పేజీల లేఖ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఆలేఖలో ఉమ్మడి వరంగల్‌కు చెందిన పలువురు నేతల విషయాలను ప్రస్తావించడం చర్చనీయాంశమవుతోంది. సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్ రెడ్డి పేర్లను ప్రస్తావించారు. గత ఎన్నికల్లో వారు పోటీ చేసిన నియోజకవర్గాలపై పూర్తిగా తమకు పట్టున్నా.. సీట్లను వారి కోసం వదిలి గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తే.. ఇప్పుడు ఎందుకలా వ్యవహరిస్తున్నారో తెలియడం లేదని పేర్కొన్నారు. గతంలో వేం నరేందర్ రెడ్డి తన భార్యపై పోటీ చేస్తే 2వేల ఓట్లు వచ్చాయని ప్రస్తావించడంతోపాటు వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అందరూ జోక్యం చేసుకుంటూ తమ ప్రాబల్యం ఉండకుండా చేస్తున్నారన్న పలు వ్యాఖ్యలతో మరో వివాదానికి తెరలేపినట్లయ్యింది.

వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్‌పై వేటు

- డీజీపీ కార్యాలయానికి అటాచ్డ్
- ఆయన స్థానంలో ఎన్.శుభంప్రకాశ్ నియామకం.. బాధ్యతల స్వీకరణ



ఏసీపీ శుభంప్రకాశ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న వరంగల్ డివిజన్ పోలీసులు

సాక్షి, వరంగల్: వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్‌పై వేటు పడింది. కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళికి వివిధ సందర్భాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఎస్కార్ట్ కల్పించి మెమోలు అందుకున్నారు. కాంగ్రెస్ నేత నవీన్‌రాజ్‌కు ఏ పదవి లేకున్నా కూడా పోలీసు భద్రత కల్పించి వివాదాల్లో చిక్కుకున్నారు. మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకల్లో కూడా పాల్గొన్న ఆయన వివాదాలకు కేంద్రబిందువుగా మారిన సందర్భాలున్నాయి. కేవలం 15నెలల పాటు పనిచేసిన నందిరాంనాయక్‌ను డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఎక్కడ కూడా పోస్టింగ్ ఇవ్వలేదు. ఆస్థానంలో 2022 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఎన్.శుభంప్రకాశ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శనివారం ఉత్తర్వులు జారీచేశారు. శుభంప్రకాశ్ 2024లో వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఆరు నెలలపాటు ట్రెయినీ ఐపీఎస్‌గా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం కరీంనగర్ రూరల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసుగా పనిచేస్తున్నారు. ఏసీపీగా రానున్న ఆయనకు వరంగల్‌పై కొంత అవగాహన ఉంది. కాగా, ఆయన సాయంత్రం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ డివిజన్ పోలీసులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు.

'అధికారుల దృష్టికి సమస్యలు తీసుకెళ్లాలి'

హన్మకొండ: రైతులు, విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్, హనుమకొండ సర్కిల్ ఎస్‌ఈలు కె.గౌతంరెడ్డి, పి.మధుసూదన్‌రావు శనివారం వేర్వేరు ప్రకటనల్లో సూచించారు. వదులుగా ఉన్న, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెలు, వంగిన స్తంభాలు, లైన్ క్రాసింగ్ వంటి ప్రమాదకరంగా ఉన్న వాటిని వెంటనే స్థానిక సెక్షన్ ఆఫీసర్, ఏఈల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. జీరో ఆక్సిడెంట్ లక్ష్యంతో రైతులు, విద్యుత్ వినియోగదారులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వర్షాలు, ఈదురు గాలులకు తీగలు తెగిపడితే వెంటనే సమాచారాన్ని ఏఈలకు అందించాలన్నారు. విద్యుత్ సమస్యలు తలెత్తితే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

కుల్లా, నిత్యక్లిన్నా క్రమాలలో శ్రీభద్రకాళి



వారాహిగా స్నపనభేరానికి ప్రత్యేక అలంకరణ



నిత్యక్లిన్నాగా భోగభేరానికి అమ్మవారు

హన్మకొండ కల్చరల్ : శ్రీభద్రకాళీ దేవాలయంలో జరుగుతున్న శాకంబరీ ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు శనివారం అమ్మవారిని కుల్లాక్రమంలో, నిత్యక్లిన్నా క్రమంలో పూజలు నిర్వహించారు. ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో వేద పండితులు ఉదయంనుంచి సుప్రభాతసేవ, నిత్యాహ్నికం, చతుఃస్థానార్చన నిర్వహించారు. అనంతరం కాళీక్రమాన్ని అనుసరించి స్నపనభేరానికి కుల్లాగా పూజలు నిర్వహించి, వారాహీ అమ్మవారిగా అలంకరించారు. షోడశీక్రమాన్ని అనుసరించి స్నపనమందిరంలోని భోగభేరాన్ని నిత్యక్లిన్నాగా అలంకరించి పూజలు జరిపారు. ఈఓ శేషుభారతి పర్యవేక్షించారు.

స్మార్ట్ సిటీ పెండింగ్ పనులు పూర్తి చేయండి

గ్రేటర్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

భద్రకాళి బండ్ అభివృద్ధి పనుల పరిశీలన



అభివృద్ధి పనులపై ఇంజనీర్లతో చర్చిస్తున్న కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

వరంగల్ అర్బన్: స్మార్ట్‌సిటీ పెండింగ్ ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ఆదేశించారు. శనివారం భద్రకాళి బండ్‌పై పూర్తయిన స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులను, పెండింగ్ పనులను ఆమె క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. స్మార్ట్ సిటీలో భాగంగా భద్రకాళి బండ్‌పై ఏ, బీ, సీ, డీ జోన్ల వారీగా ఇప్పటికే పూర్తి చేసిన పనులను వాటి అంచనా వ్యయాలతో పాటు సమగ్ర వివరాలను కమిషనర్ ఇంజనీరింగ్ స్మార్ట్ సిటీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బొంది వాగు నుంచి వచ్చే నాలతోపాటు పోతన జంక్షన్ ప్రాంతం నుంచి వచ్చే 12 మోరీల నాలలను కమిషనర్ పర్యవేక్షించారు. ఆయా జోన్లలో మిగిలిన ఎలక్ట్రికల్, సివిల్ పనులకు సంబంధించి కమిషనర్ పలు సూచనలిచ్చారు. మిగతా చిన్న చిన్న పనులు పూర్తి చేయాలి. స్కీంలో పెట్టుకునేందుకు అవకావం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఈఈలు శ్రీనివాస్, రవికుమార్, స్మార్ట్ సిటీ ప్రతినిధులు ఆనంద్ ఓలేటి, శ్రీనివాసరాజు, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు స్ట్రీట్ వెండర్స్ ఫుడ్ ఫెస్టివల్

వరంగల్ బల్దియా మెప్మా ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 3 నుంచి రాత్రి 10 గంటల వరకు స్థానిక స్ట్రీట్ వెండర్ల ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. భద్రకాళీ బండ్, హంటర్ రోడ్డు, హనుమకొండలలో ఈ ఫుడ్ ఫెస్టివల్ ఉంటుందని, నగర ప్రజలు పెద్దఎత్తున హాజరు కావాలని కోరారు.

పీవీ సంస్కరణలతో దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టం

పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి



డీసీసీ భవన్‌లో పీవీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, నాయకులు

హన్మకొండ చౌరస్తా: రాజనీతిజ్ఞుడు, తెలుగు ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన దివంగత ప్రధాని పీవీ నరసింహారావు తెచ్చిన ఆర్థిక సంస్కరణలు భారతదేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేశాయని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ భవన్‌లో శనివారం పీవీ నరసింహారావు 104వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పీవీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ.. పీవీ ఆలోచనలు, ఆర్థిక సంస్కరణలు భారత్‌ను అభివృద్ధివైపు తీసుకెళ్లాయన్నారు. అనంతరం జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం జంక్షన్‌లోని పీవీ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాసరావు, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ అజీజ్‌ఖాన్, కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ తోట వెంకటేశ్వర్లు కాంగ్రెస్ నాయకులు బంక సంపత్, నాయిని లక్ష్మారెడ్డి, అంకూస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్థిక వ్యవస్థలో పీవీ విప్లవాత్మక సంస్కరణలు



హన్మకొండ: భారత ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలకు బీజం వేసి కుంటుపడుతున్న ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసిన ఘనత మాజీ ప్రధాని పి.వి.నరసింహారావుకే దక్కుతుందని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు 104వ జయంతి నిర్వహించారు. ముందు పి.వి. చిత్రపటానికి సీఎండీ, డైరెక్టర్లు, అధికారులు, ఉద్యోగులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ సరళీకృత ఆర్థిక విధానాల అమలు ఫలితంగా దేశంలో ఉద్యోగావకాశాలు పెరిగాయన్నారు. పీవీ ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, ప్రధాన మంత్రిగా ఆ పదవులకే వన్నె తీసుకొచ్చారన్నారు. దేశ పురోగాభివృద్ధికి పీవీ ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వి.మోహన్ రావు, టి.మధుసూదన్, సి.ప్రభాకర్, చీఫ్ ఇంజనీర్లు టి.సదర్‌లాల్, బి.అశోక్ కుమార్, కె.తిరుమల్ రావు, రాజు చౌహాన్, రవీంద్రనాథ్, అశోక్, వెంకటరమణ, ఆర్.చరణ్ దాస్, మాధవ్ రావు, జాయింట్ సెక్రటరీ కె.రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

5,6 తేదీల్లో ఓపెన్ టు ఆల్ చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో జూలై 5,6 తేదీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఓపెన్ టు ఆల్ చెస్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కార్యదర్శి పి. కన్నా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్ సమీపం టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించే పోటీలకు ఆసక్తి గల క్రీడాకారులు జూలై 4వ తేదీ సాయంత్రంలోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ వెంట చెస్ బోర్డు తెచ్చుకోవాలని సూచించారు. ఇందులో గెలుపొందిన నలుగురిని జూలై 11, 12, 13 తేదీల్లో ఖమ్మంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 90595 22986 నంబర్‌లో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

సమన్వయంతో సీజనల్ వ్యాధుల నియంత్రణ

- రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఎస్.సంగీత సత్యనారాయణ



మాట్లాడుతున్న రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సంగీత సత్యనారాయణ

హన్మకొండ: జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు సంబంధిత ప్రభుత్వ విభాగాలతో సమన్వయంతో పని చేస్తూ సీజనల్ వ్యాధుల నియంత్రణకు కృషి చేయాలని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఎస్.సంగీత సత్యనారాయణ సూచించారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులతో సీజనల్ వ్యాధులు, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ముందుగా జిల్లాల వారీగా నమోదవుతున్న మలేరియా, డెంగీ, ఇతర వ్యాధుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వరంగల్ జిల్లా వైద్యారోగ శాఖాధికారి, సంబంధిత అధికారులు ఎంజీఎంలో నమోదవుతున్న మలేరియా, డెంగీ పాజిటివ్ కేసుల వివరాలను డీఎంహెచ్‌ఓలకు అందించాలన్నారు. కలెక్టర్ల ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలల్లో హెచ్‌ఎంలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి సీజనల్ వ్యాధులు, ముఖ్యంగా చేతుల శుభ్రత, ఓఆర్ఎస్ ద్రావణం తయారీ విధానం, జ్వరాలు, డయేరియాకు సంబంధించిన ప్రమాదకర లక్షణాల గురించి అవగాహన కల్పించాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో ఈ కార్యక్రమాల గురించి ప్రచారం చేయాలన్నారు. ప్రతీ మంగళవారం ఎంపిక చేసిన ఆరోగ్య కేంద్రాలలో నిర్వహించే ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని మరింత పటిష్టంగా నిర్వహించాలని, ఆశలు, ఏఎన్ఎంలకు అవసరమైన సూచనలు చేయాలన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో బాలికల లింగ నిష్పత్తి చాలా తక్కువ ఉందని, ఈ దిశగా డీఎంహెచ్‌ఓలు బాధ్యతగా తగిన చర్యలు చేపట్టాలని, లింగ నిర్ధారణ పరీక్షలపై నిఘా పెంచాలన్నారు. లింగ వివక్షతపై అవగాహన కల్పించాలన్నారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ఎక్స్‌రే పరీక్షలు అవసరం వారికి ఆర్.బి.ఎస్.కె వాహనం ద్వారా అందుబాటులో ఉన్న సెంటర్లకు తీసుకెళ్లి పరీక్షలు నిర్వహించాలన్నారు. మేనరికపు వివాహాలకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. హనుమకొండ, వరంగల్, ములుగు, జనగామ, మహబూబాబాద్ జిల్లాల డీఎంహెచ్‌ఓలు ఎ.అప్పయ్య, బి.సాంబశివరావు, గోపాల్ రావు, మల్లికార్జున్, రవి రాథోడ్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రోగ్రాం అధికారి శ్రీదేవి పాల్గొన్నారు.

బీసీలపై రాజకీయ పార్టీల చిన్నచూపు

- 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసే ఎన్నికలకు పోవాలి
- బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

కాజీపేట రూరల్ : బీసీలను అన్ని రాజకీయ పార్టీలు చిన్న చూపు చూస్తున్నాయని, జనాభా దామాషా ప్రకారం బీసీలకు వాటా ఇచ్చే వరకూ అవిశ్రాంత పోరాటం చేస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కాజీపేట ఫాతిమానగర్ వైష్ణవిగ్రాండ్ హోటల్‌లో శనివారం బీసీ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వద్దకొండ వేణుగోపాల్‌గౌడ్ అధ్యక్షతన 'స్థానిక సంస్థల ఎన్నికలు–బీసీల రిజర్వేషన్ల పెంపు' అనే అంశం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు లేకుండానే స్థానిక సంస్థల ఎన్నికలకు పోవాలని రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. నెల రోజుల్లో రిజర్వేషన్లు నిర్ణయించి ఎన్నికల సంఘానికి నివేదించాలని హైకోర్టు ఆదేశించిన ప్రభుత్వం ఇంకా చర్యలు చేపట్టడం లేదన్నారు. బీజేపీ నాయకులు గల్లీలో ఒక మాట, ఢిల్లీలో మరోమాటతో బీసీలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ బీసీల వ్యతిరేక పార్టీ అని, కాంగ్రెస్, బీజేపీ మాత్రమే రిజర్వేషన్లు తేల్చాలని డిమాండ్ చేశారు. 48 గంటల్లోగా సీఎం రేవంత్‌రెడ్డి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి రిజర్వేషన్ల అంశంపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. మరోవైపు ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని డైవర్ట్ చేయడానికి ఎమ్మెల్సీ కవిత బీసీ నినాదం ఎత్తుకున్నారని ధ్వజమెత్తారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకు రాని బీసీ రిజర్వేషన్ల అంశం ఇప్పుడు గుర్తొచ్చిందా అని ప్రశ్నించారు. త్వరలో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్పించి 42 శాతం బీసీ బిల్లు ఆమోదింపజేయాలని, లేనిపక్షంలో తెలంగాణలో బీజేపీని మట్టికరిపిస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాడి మల్లయ్యయాదవ్, బీసీ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు డాక్టర్ చిర్ర రాజు, తమ్మేలా శోభారాణి, మాదం పద్మజాదేవి, కాసగాని అశోక్‌గౌడ్, డాక్టర్ సంగాని మల్లేశ్వర్, మేముల మహేందర్, వల్లాల జగన్‌గౌడ్, పంజాల మధు, తెల్ల కిశోర్, తెల్ల సుగుణ, బూర్గుల ప్రమోద, బాబుయాదవ్ పాల్గొన్నారు.

పచ్చళ్ల తయారీ కేంద్రాలపై దాడులు

- రూ.18.29 లక్షల విలువైన పాడైన ఉత్పత్తులు స్వాధీనం

వరంగల్ చౌరస్తా : కాశిబుగ్గ సమీపంలో నిషేధిత రసాయనాలు వినియోగిస్తూ నాణ్యత, పరిశుభ్రత పాటించకుండా పచ్చళ్లు తయారీ చేస్తున్న వాసు పికిల్స్, నీలకంఠ పికిల్స్ కంపెనీలపై టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ జి . బాబులాల్ సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. వాసు పికిల్స్ కంపెనీ ఎలాంటి అనుమతులు (ఎఫ్ఎస్ఎస్ఏఐ) లేకుండా పచ్చళ్లు తయారీ చేస్తున్నారు. శుభ్రత లేకుండా నిషేధిత రసాయనాలతో పచ్చళ్లు తయారీ చేస్తూ పాడైపోయినా అమ్మకానికి పెడుతున్నారని టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలిపారు. పాడైపోయినా నిల్వచేసిన వాసు పికిల్స్ కంపెనీ నుంచి 5 రకాల సుమారు రూ. 10.49 లక్షల విలువైన పచ్చళ్ల స్వాధీనం చేసుకున్నారు. ఈ కంపెనీని అరుకల శ్రీనివాస్ అనే వ్యక్తి నిర్వహిస్తున్నారన్నారు. అలాగే, నీలకంఠ పికిల్స్ కంపెనీ డిస్ట్రిబ్యూటర్ మార్త శంకర్ నుంచి 5 రకాల సుమారు రూ. 7.80లక్షలు.. మొత్తం రూ.18,29,267 విలువైన పాడైన పచ్చళ్ల ఉత్పత్తులు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. వీరిపై చర్యలు తీసుకోవాలని ఇంతేజార్‌గంజ్ పోలీసులకు కేసు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులు వెల్లడించారు.

ఫైనాన్స్ వ్యాపారి దారుణ హత్య

- కాజీపేట రైల్వే క్వార్టర్స్‌లో ఘటన
- హత్యకు గల కారణాలపై పోలీసుల ఆరా
- పోలీసులకు లొంగిపోయిన నిందితుడు?



నవీన్‌కుమార్ (ఫైల్)



హత్యకు ఉపయోగించిన కత్తి

కాజీపేట: ఓ ఫైనాన్స్ వ్యాపారి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి కాజీపేట రైల్వే క్వార్టర్స్‌లో జరిగింది. మృతుడి భార్య మాధవి, పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ జేపీఎన్ రోడ్డుకు చెందిన త్రిపురాధి నవీన్‌కుమార్ (55) ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నాడు. కొంతకాలంగా కాజీపేటలోని చిరువ్యాపారులు, రైల్వే, ఎఫ్‌సీఐ, ప్రైవేట్ ఉద్యోగులకు వడ్డీలకు డబ్బులు ఇస్తున్నాడు. ఈ క్రమంలో రైల్వే ఈఎల్ఎస్ షెడ్‌లో పనిచేసే గడ్డం ప్రవీణ్‌కుమార్‌కు ఆరు నెలల క్రితం రూ.50 వేలు అప్పుగా ఇచ్చాడు. అప్పు తీసుకున్నప్పటి నుంచి ప్రవీణ్‌కుమార్ అసలుతోపాటు వడ్డీ కూడా చెల్లించకపోవడంతో మృతుడు కొద్దికాలంగా ప్రవీణ్‌కుమార్‌పై ఒత్తిడి పెంచడంతో ఇద్దరి మధ్య మనస్పర్థలు పెరిగాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి నవీన్‌కుమార్ రైల్వే క్వార్టర్స్‌కు వెళ్లి నిందితుడు ప్రవీణ్‌కుమార్‌ను నిలదీయడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం పెరిగింది. ఆ తర్వాత గొడవ సద్దుమణగడంతో ఇద్దరు కలిసి మద్యం సేవించారు. అయితే డబ్బుల విషయంలో జరిగిన గొడవను మనసులో పెట్టుకున్న ప్రవీణ్‌కుమార్.. కూరగాయలు కోసే కత్తితో విచక్షణారహితంగా పొడవడంతో నవీన్‌కుమార్ తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. అనంతరం నిందితుడు నేరుగా కాజీపేట పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయినట్లు సమాచారం.

హత్య కేసులో విభిన్న వాదనలు ..

ఫైనాన్స్ వ్యాపారి నవీన్‌కుమార్ హత్యపై విభిన్న వాదనలు వినిపిస్తున్నాయి. అప్పులు ఇచ్చిన తర్వాత అధిక మొత్తంలో వడ్డీలు వసూలు చేయడం, చెక్ బౌన్స్ కేసులు నమోదు చేయించడం, ఇళ్లు, స్థలాలు రాయించుకోవడం వంటి పనులు చేస్తుండేవాడనే ఆరోపనలు వినిపిస్తున్నాయి. కాగా, నవీన్‌కుమార్‌ను నిందితుడు ప్రవీణ్‌కుమార్ మధ్యాహ్నమే రైల్వే క్వార్టర్‌లో చంపి మృతదేహాన్ని బయటపడేయడం కోసం ప్రయత్నించగా ఆటో డ్రైవర్లు ఎవరూ సహకరించకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో పోలీసులకు నిందితుడు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. కాగా, ఫైనాన్స్ వ్యాపారి నవీన్‌కుమార్ హత్య సమాచారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఘటనా స్థలికి పోలీసు అధికారులు..

కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్ రెడ్డి, ఇన్‌చార్జ్ సీఐ పుల్యాల కిషన్‌తో పాటు టాస్క్‌ఫోర్స్, క్రైమ్ సిబ్బంది, క్లూస్ టీం బృందం ఘటనాస్థలిని సందర్శించి ఆధారాలు సేకరించారు. నవీన్‌కుమార్ హత్య వెనుక నిందితుడితో పాటు ఇంకా ఎవరైనా ఉన్నారా? లేక ఒక్కడే హత్య చేసి ఉంటాడా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. కాజీపేట చౌరస్తా నుంచి రైల్వే క్వార్టర్స్‌కు వెళ్లే రహదారుల్లో ఉన్న సీసీ కెమెరాలను జల్లెడ పడుతున్నారు. మృతుడి భార్య త్రిపురాధి మాధవి ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. కాగా, తన భర్త ఒంటిపైనుంచి రూ. 6 లక్షల విలువైన బంగారు ఆభరణాలు నిందితుడు ప్రవీణ్‌కుమార్ తీసుకున్నాడని మృతుడి భార్య మాధవి ఆరోపించింది.

సమ్మక్క సాగర్‌కు జలకళ..

- ఎగువ నుంచి బ్యారేజీలోకి 21,500 క్యూసెక్కుల నీరు చేరిక
- మూడు గేట్లు ఎత్తి 27,000 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల



నీటితో కళకళలాడుతున్న సమ్మక్క సాగర్ బ్యారేజీ

కన్నాయిగూడెం: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం గ్రామం వద్ద గోదావరిపై నిర్మించిన సమ్మక్క సాగర్ జలకళ సంతరించుకుంది. కొన్ని రోజుల నుంచి బ్యారేజీలో నీరులేక పోవడంతో బోసిపోయిన గోదావరి.. వారం రోజుల నుంచి ఎగువన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు భారీగా నీరు చేరడంతో గోదావరి నిండుగా ప్రవహిస్తోంది. దీంతో బ్యారేజీలోకి ఎగువ నుంచి 21,500 క్యూసెక్కుల నీరు చేరడంతో అధికారులు బ్యారేజీ వద్ద 59 గేట్లలో మూడు గేట్లు ఎత్తి 27,000 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. బ్యారేజీ సామర్థ్యం 6.94 టీఎంసీలకు గాను ప్రస్తుతం 3.81టీఎంసీల నీరు ఉంది. బ్యారేజీ నీటి మట్టం 83 మీటర్లకు గాను 79.50 మీటర్ల నీటి మట్టం కొనసాగుతోంది. కాగా, దేవాదుల వద్ద ఉన్న చొక్కారావు ఎత్తిపోతల నుంచి రెండు మోటార్ల ద్వారా 494 క్యూసెక్కుల నీరు ఎత్తిపోస్తున్నట్లు డీఈ శరత్ బాబు తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో దొంగ అరెస్ట్

- రూ. 2.86 లక్షల విలువైన ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన వరంగల్ జీఆర్పీ సీఐ సురేందర్



వివరాలు వెల్లడిస్తున్న జీఆర్పీ సీఐ సురేందర్

రామన్నపేట : వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఓ దొంగను అదుపులోకి తీసుకుని అతడి నుంచి రూ. 2,86,645 విలువైన ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు వరంగల్ జీఆర్పీ సీఐ సురేందర్ తెలిపారు. జీఆర్పీ సీఐ కథనం ప్రకారం.. శనివారం ఉదయం 9 గంటల సమయంలో నాలుగో ప్లాట్‌ఫామ్ వద్ద చింతల్ వైపున తనిఖీలు చేస్తుండగా మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం బంగ్లా తండాకు చెందిన ఇస్లావత్ సురేశ్ అనుమానాస్పదంగా సంచరిస్తూ కనిపించాడు. దీంతో అతడిని తనిఖీ చేయగా 28.645 గ్రాముల బంగారం చైన్, రెండు పుస్తెలు, 3 జతల చెవి కమ్మలు లభ్యమయ్యాయి. నిందితుడు ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లో బంగారం చోరీ చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. దీంతో అరెస్ట్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ సీఐ తెలిపారు. కాగా, నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సిబ్బంది రాము, రియాజుద్దీన్, నాగరాజు, రామకృష్ణ, రమేశ్. మనోజ్‌కుమార్‌ను జీఆర్పీ సీఐ అభినందించారు.

పక్కా వంద సీట్లు.. సర్వేలన్నీ మనవైపే

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



మాట్లాడుతున్న దయాకర్‌రావు

హసన్‌పర్తి: వచ్చే ఎన్నికల్లో పక్కాగా వంద అసెంబ్లీ స్థానాల్లో గులాబీ జెండా ఎగురవేస్తామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బీఆర్ఎస్ వర్ధన్నపేట నియోజకవర్గ ముఖ్యకార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నగరంలోని నాని గార్డెన్‌లో శనివారం జరిగింది. సమావేశానికి మాజీ మంత్రి దయాకర్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సర్వేలన్నీ గులాబీ వైపు చూపుతున్నాయని తెలిపారు. గత ఎన్నికల్లో మోసపూరిత హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రైతులకు కనీసం సాగు నీరు అందించకుండా వారి కళ్లల్లో కన్నీళ్లు నిలిపిందన్నారు. నాట్లకి..నాట్లకి రైతుబంధు కేసీఆర్ వేస్తే.. రేవంత్ మాత్రం ఓట్లకు ఓట్లకు రైతు భరోసా వేస్తున్నాడని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి ఓ అబద్ధాల కోరుగా అభివర్ణించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపునకు పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేశ్‌రెడ్డి, మొట్టు శ్రీనివాస్, కార్పొరేటర్లు ఇండ్ల నాగేశ్వర్‌రావు, రాధికారెడ్డి, నాయకులు శ్రీధర్, అటికం రవీందర్, చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, మార్గం భిక్షపతి, అప్పారావు, బండి రజనీకుమార్, తూర్ల కుమారస్వామి, కందుకూరి చంద్రమోహన్, పాడి మల్లారెడ్డి, నద్దునూరి నాగరాజు, జోరుక రమేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

- కళాశాల విద్య జాయింట్ డైరెక్టర్ రాజేందర్‌సింగ్



పింగిళి కళాశాలలో సమావేశంలో మాట్లాడుతున్న కళాశాల విద్య జాయింట్ డైరెక్టర్ రాజేందర్‌సింగ్

విద్యారణ్యపురి/న్యూశాయంపేట: విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నతంగా ఎదగాలని కళాశాల విద్య జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజేందర్‌సింగ్ కోరారు. శనివారం హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల(అటానమస్), కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ (కేడీసీ), దేశాయిపేటలోని సీకేఎం ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీని సందర్శించారు. ఆయా కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే రోజుల్లో పింగిళి మహిళా కళాశాల ఏప్లస్ గ్రేడ్ సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులను పోటీపరీక్షలకు కూడా సన్నద్ధం చేయాలన్నారు. కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రీసెర్చ్‌సెంటర్‌గా గుర్తింపు రావడంపై అభినందించారు. సీకేఎం కళాశాలలోని గ్రంథాలయం, ప్రయోగశాల, మహిళా హాస్టల్ తదితర వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా సమావేశంలో ప్రిన్సిపాళ్లు బి.చంద్రమౌళి, జి.శ్రీనివాస్, ఎ.ధర్మారెడ్డి, వైస్ ప్రిన్సిపాళ్లు సుహాసిని, రజనీలత, వరప్రసాదరావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సురేష్‌బాబు, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ అరుణ, డాక్టర్ శశిధర్‌రావు, ప్రొఫెసర్ రాజారెడ్డి, టీజీసీజీటీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.చిన్న, జిల్లా కార్యదర్శి రవికుమార్, కేయూ సెక్రటరీ జి.సమ్మయ్య, సతీష్‌కుమార్, అధ్యాపకులు సీతారాములు, మహేందర్ శ్రీనాథ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

పీఎన్‌డీటీ చట్టం అమలుపై ప్రత్యేక నిఘా



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ అప్పయ్య

ఎంజీఎం: జిల్లాలో లింగ నిర్ధారణ చట్టం (పీఎన్‌డీటీ) అమలు, ఎంటీపీ చట్టాన్ని కచ్చితంగా అమలు చేసేందుకు ఆయా స్కానింగ్ కేంద్రాలు, ఆస్పత్రులపై ప్రత్యేక నిఘాతో ముందుకు సాగాలని హనుమకొండ వైద్య ఆరోగ్యశాఖ అధికారి అప్పయ్య పేర్కొన్నారు. శనివారం గర్భస్థ పూర్వ, పిండ లింగ నిర్ధారణ చట్టం జిల్లా స్థాయి అడ్వయిజరీ సమావేశాన్ని హనుమకొండ కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌ఓ అప్పయ్య మాట్లాడుతూ.. జిల్లాలో చట్టం అమలుకు తీసుకున్న చర్యలను, బాలికల, నిష్పత్తి గురించి సభ్యులకు వివరించారు. వైద్య ఆరోగ్యశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, ఇతర విభాగాలు లింగ వివక్షపై అవగాహన కల్పించాలని సూచించారు. ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన వారికి నోటీసులివ్వనున్నట్లు తెలిపారు. నిర్ణీత సమయంలో తప్పులు సరిదిద్దుకోకపోతే జరిమానా విధించనున్నట్లు తెలిపారు. చట్టం ఉల్లంఘిస్తున్న వారి వివరాలు, అబార్షన్లు నిర్వహించే వారి వివరాలు 63000 30940 నంబర్‌కు వాట్సాప్ చేయాలని, కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో బాలికల నిష్పత్తి తక్కువగా ఉన్న వేలేరు మండలంలో ప్రత్యేక శ్రద్ధ వహించి క్షేత్రస్థాయి సిబ్బందితో తరచూ సమీక్ష నిర్వహించి వివిధ ప్రభుత్వ విభాగాలు, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో జీఎంహెచ్ ప్రొఫెసర్ గైనకాలజిస్ట్ రాజేశ్వరి, పీఓఎంహెచ్ఎన్ మంజుల, సభ్యులు రేవతిదేవి, ఎస్.కవిత, జిల్లా కోర్టు సిబ్బంది నాగరాజు, డెమో అశోక్‌రెడ్డి, ఎస్ఓ ప్రసన్నకుమార్, హెచ్ఈఓ రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు చదువులో ప్రతిభ కనబర్చాలి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి

ధర్మసాగర్ : గురుకుల పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులు చదువులో ప్రతిభ కనబరిచి మంచి మార్కులు సాధించాలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. హనుమకొండ పట్టణంలోని హంటర్‌రోడ్డులో గల ధర్మసాగర్ మండల సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదట తరగతి గదులు, తాగునీటి సౌకర్యం, విద్యార్థులకు అందుతున్న భోజన నాణ్యతను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. పాఠశాలలోని సదుపాయాలు, చెత్త, మరుగుదొడ్ల నిర్వహణ, సీజనల్ జ్వరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల హాజరు శాతం, పదో తరగతి ఫలితాల వివరాలు ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్లాస్ రూంలోకి వెళ్లి విద్యార్థులకు పాఠాలు చెప్పడంతోపాటు వారిని పలు ప్రశ్నలు అడిగారు. గురుకుల సెక్రటరీతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించాలని అన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని అన్నారు. అనంతరం కరుణాపురంలోని మహాత్మా జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఆహారం, తాగునీరు, కిచెన్, క్లాస్ రూమ్స్, టాయిలెట్స్‌ను పరిశీలించారు. ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్, హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం, అధికారులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణకు పనిచేయాలి

- అడిషనల్ డీసీపీ రవి



మాట్లాడుతున్న డీసీపీ రవి

వరంగల్ క్రైం: బాలలను సంరక్షించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని వరంగల్ పోలీస్ కమిషనరేట్ అడ్మిన్ అడిషనల్ డీసీపీ రవి సూచించారు. జులై 1 నుంచి నెలరోజులు నిర్వహించనున్న ఆపరేషన్ ముస్కాన్–11వ విడత కార్యక్రమంపై అదనపు డీసీపీ ఆధ్వర్యంలో శనివారం కమిషనరేట్‌లో అధికారులు సమన్వయ సమావేశం నిర్వహించారు. హ్యూమన్ ట్రాఫిక్ విభాగంతో పాటు వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల స్త్రీ శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, చైల్డ్ లైన్ 1098 విద్యాశాఖ, కార్మిక శాఖ చెందిన అధికారులు ఈసమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా అడిషనల్ డీసీపీ రవి మాట్లాడుతూ.. కమిషనరేట్ పరిధిలో 18 ఏళ్లలోపు పిల్లల్ని ఎవరైనా హింసించినా, భిక్షాటన చేయించినా, పిల్లల్ని బాల కార్మికులుగా మార్చినా అలాంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అదనపు డీసీపీ హెచ్చరించారు. ఈసందర్భంగా ఆపరేషన్ ముస్కాన్‌పై రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. హాజరైన అన్ని శాఖల ప్రతినిధులతో ఆపరేషన్ ముస్కాన్ ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వరంగల్ పోలీస్ శిక్షణ కళాశాలలోని వస్తువుల వేలం

హన్మకొండ కల్చరల్ : వరంగల్ మామూనూరు పోలీస్ శిక్షణ కళాశాలలోని వాడకోవడానికి పనిరాని వస్తువులను, పాతవస్తువులను విక్రయించేందుకు వేలం వేస్తున్నామని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల కొనుగోలుదారులు వారి ఆధార్‌కార్డుతో జూలై 7న ఉదయం 10.30గంటలకు కళాశాలలో నిర్వహించే వేలానికి హాజరు కావాలన్నారు. ఉపయోగంలో లేని ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ వస్తువులు, ఇనుపసామన్లు, టెంట్లు, ప్లాస్టిక్ వస్తువులు వేలం వేస్తున్నట్లు వివరించారు. వివరాలకు 87125 97562, 96403 33445 నంబర్లలో సంప్రదించాలని కోరారు.